ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5

తమిళనాడు
TAMILNADU
మంగళవారం 19 ఆగస్టు 2025

రజనీతో నయినార్ నాగేంద్రన్ భేటీ

సీపీ రాధాకృష్ణన్‌కు అన్ని పార్టీలు మద్దతివ్వాలి ● బీజేపీ అధ్యక్షుడి వినతి

చెన్నై, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సూపర్‌స్టార్ రజనీకాంత్‌తో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ సోమవారం భేటీ అయ్యారు. సినీ రంగంలో అడుగుపెట్టి 50 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రజనీకి నయినార్ శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక పోయెస్‌గార్డెన్‌లోని రజనీ నివాసానికి వెళ్లిన నయినార్.. ఆయనతో కొద్దిసేపు భేటీ అయ్యారు. సోదరుడు రజనీ నూరేళ్లు సినీ ప్రపంచంలో వెలుగొందాలని ఆకాంక్షించారు. ఇందుకు రజనీ కృతజ్ఞతలు తెలిపారు.

మద్దతివ్వండి : నయినార్ నాగేంద్రన్

ఉపరాష్ట్రపతి పదవికి ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా ఎంపికైన సీపీ రాధాకృష్ణన్‌కు తమిళనాడుకు చెందిన అన్ని పార్టీలు మద్దతు ఇవ్వాలని నయినార్ నాగేంద్రన్ విజ్ఞప్తి చేశారు. నయినార్ సోమవారం మీడియాతో మాట్లాడుతూ.. సీపీ రాధాకృష్ణన్‌ను ఆ పదవికి ఎంపిక చేయడం ద్వారా బీజేపీ, ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తమిళనాడుకు మరో కిరీటం తొడిగినట్లయిందన్నారు. తమిళులపై వారికి ఉన్న అపార గౌరవానికి ఇదొక ఉదాహరణ అన్నారు. సీపీ రాధాకృష్ణన్ ఆది నుంచి జాతి ప్రయోజనాల కోసం కృషి చేశారన్నారు. రెండు మార్లు లోక్‌సభకు ఎన్నికైన ఆయన.. కొబ్బరిపీచు బోర్డు నిర్వాహకుడిగా బాధ్యతలు నిర్వర్తించారన్నారు. 1998లో జరిగిన వరుస బాంబు పేలుళ్ల వల్ల స్తంభించిన కోయంబత్తూరు నగరానికి సీపీ రాధాకృష్ణన్ చేసిన సేవలే ప్రాణం పోశాయని నయినార్ గుర్తు చేశారు. ప్రజల కోసం కష్టపడే వారిని బీజేపీ ఎప్పటికీ గుర్తిస్తుందన్నారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వం తమిళనాడు నుంచి ఇప్పటికే కలాంను రాష్ట్రపతిని చేసిందని, ఇప్పుడు రాధాకృష్ణన్‌ను కూడా పంపడం తమిళనాడుకు గర్వకారణమన్నారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో అన్ని పార్టీలు కలిసి కట్టుగా సీపీ రాధాకృష్ణన్‌కు మద్దతు పలకాలని విజ్ఞప్తి చేశారు. ఆయన విజయం కోసం మంగళవారం బీజేపీ నేతలు, కార్యకర్తలంతా రాష్ట్రంలో ఉన్న అన్ని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.



రజనీకి శుభాకాంక్షలు చెబుతున్న నయినార్ నాగేంద్రన్



దురైమురుగన్ ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకుంటున్న సీఎం స్టాలిన్

దురైమురుగన్‌కు సీఎం పరామర్శ

పెరంబూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మోచేతికి స్వల్ప గాయం కారణంగా ఇటీవల ఆస్పత్రిలో చేరి, డిశ్చార్జి అయిన రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి దురైమురుగన్‌ను ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ సోమవారం పరామర్శించారు. ఇటీవల చెన్నైలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి దురైమురుగన్ హఠాత్తుగా స్పృహతప్పి పడిపోయారు. ఆయన్ని వెంటనే ఆస్పత్రికి తరలించగా, పరీక్షలు నిర్వహించిన వైద్యులు, చేతి ఎముకలు స్వల్పంగా విరిగినట్లు గుర్తించి, చికిత్సలందించారు. మూడు రోజులు ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం మంత్రి సోమవారం డిశ్చార్జి అయ్యారు. ఈ క్రమంలో, స్థానిక కొరట్టూరులోని తన ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న మంత్రి దురైమురుగన్‌ను ముఖ్యమంత్రి స్టాలిన్ పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి, చికిత్సా వివరాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. సీఎం వెంట మంత్రి ఏవీ వేలు తదితరులు ఉన్నారు.

ఆయనతో రాష్ట్రానికి ఒనగూరిందేంటో?

ఏం చేశారని మద్దతివ్వాలి? ● బీజేపీపై డీఎంకే ఎదురుదాడి

చెన్నై, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్ర గవర్నర్‌గా వున్న సీపీ రాధాకృష్ణన్‌ను ఎన్డీఏ భారత ఉపరాష్ట్రపతి పదవికి ఎంపిక చేయడం వల్ల తమిళనాడుకు ఒనగూరే ప్రయోజనమేముందని డీఎంకే ప్రశ్నించింది. ఉపరాష్ట్రపతి ఎన్నిక బరిలో నిలిచిన రాష్ట్రానికి చెందిన రాధాకృష్ణన్‌కు తమిళనాడులోని అన్ని పార్టీలు మద్దతివ్వాలంటూ బీజేపీ, అన్నాడీఎంకే చేసిన డిమాండ్‌పై డీఎంకే ఎదురుదాడికి దిగింది. డీఎంకే అధికార ప్రతినిధి టీకేఎస్ ఇళంగోవన్ మాట్లాడుతూ.. కాషాయ పార్టీకి చెందిన రాధాకృష్ణన్‌ను రెండో అగ్ర రాజ్యాంగ పదవికి ఎంపిక చేయడం వల్ల రాష్ట్రానికి ఏం లాభమో చెప్పాలని నిలదీశారు. ఆయన తమిళుడైనప్పటికీ, తమిళనాడుకు ప్రయోజనం లేని ఆయన అభ్యర్థిత్వాన్ని తామెందుకు సమర్థించాలని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇండియా కూటమి తీసుకునే నిర్ణయానికి తాము కట్టుబడి ఉంటామని స్పష్టం చేశారు. వచ్చే ఏడాది జరగనున్న అసెంబ్లీ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే రాధాకృష్ణన్‌ను ఉపరాష్ట్రపతి పదవి అభ్యర్థిగా ఎంపిక చేశారని, కానీ వారి ఆశలు అడియాశలవుతాయని ఎద్దేవా చేశారు. తమిళుడిని ఉపరాష్ట్రపతిని చేశామంటూ ప్రజల వద్దకెళ్లి ఓట్లు అభ్యర్థించేందుకే ఆయన పేరు ప్రకటించారన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తమిళనాడును అన్ని విధాలుగా అవమానిస్తోందని, రాష్ట్రానికి గానీ, రాష్ట్ర సంస్కృతికి గానీ ఆ పార్టీ చేసిందేమీ లేదని పెదవి విరిచారు. 'కీలడిలో పురావస్తు తవ్వకాలపై అమర్‌నాథ్ రామకృష్ణన్ రూపొందించిన నివేదిక ఏమైంది? కీలడి నాగరికత అతి పురాతనమైనదంటూ నివేదించిన అమర్‌నాథ్‌ను ఎందుకు ఆ పదవి నుంచి బదిలీ చేశారు? వారు తమిళ నాగరికతను పురాతనమైనదిగా ఎందుకు అంగీకరించరు? ఇది తమిళులను అవమానించడం కాదా?' అని ఇళంగోవన్ ప్రశ్నించారు. డీఎంకే మిత్రమైన ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో మాట్లాడుతూ.. సీపీ రాధాకృష్ణన్ రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరినీ గౌరవించే సంస్కారవంతుడని, అందుకే పార్టీలతో పని లేకుండా వ్యక్తిగతంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతున్నట్లు ప్రకటించారు.



టీకేఎస్ ఇళంగోవన్

సీపీ రాధాకృష్ణన్‌కు మద్దతిస్తాం

● ఈపీఎస్



పెరంబూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఉప రాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు రాష్ట్రానికి చెందిన ఎంపీలు మద్దతు ఇవ్వాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి విజ్ఞప్తి చేశారు తిరువణ్ణామలై అన్నామలైయార్ ఆలయాన్ని సోమవారం వెళ్లిన పళనిస్వామి, సంబంధ వినాయకుడి సన్నిధి, అన్నామలైయార్ సన్నిధి, ఉన్నాములైయమ్మన్ సన్నిధిలను దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ నిర్వాహకులు స్వామి ప్రసాదాలు అందజేశారు. స్వామి దర్శనం ముగించుకుని ఆలయం నుంచి వెలుపలికి వచ్చిన పళనిస్వామి మీడియాతో మాట్లాడుతూ... మహారాష్ట్ర గవర్నర్‌గా వ్యవహరిస్తున్న రాష్ట్రానికి చెందిన సీపీ రాధాకృష్ణన్‌కు ఉప రాష్ట్రపతి అయ్యే అవకాశం లభించిందన్నారు. ఆయనకు రాష్ట్రానికి చెందిన ఎంపీలు పార్టీలకు అతీతంగా మద్దతు ఇవ్వాలని పళనిస్వామి విజ్ఞప్తి చేశారు.



సంప్రదాయ వస్త్రధారణలో విద్యార్థినుల సందడి

సకల సంప్రదాయాల సమ్మేళనం

● ఎస్‌కేపీసీలో మురిపించిన విద్యార్థినులు

ప్యారీస్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జిటౌన్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి ఆర్ట్స్ అండ్ సైన్స్ మహిళా కళాశాల (ఎస్‌కేపీసీ), ఐక్యూఏసీ, చైతన్య కళాలయ ఫైన్‌ఆర్ట్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో చైతన్య మెగా ఇంటర్ అంతర్ కళాశాల కల్చరల్ ఫెస్ట్ సోమవారం ప్రారంభమైంది. విద్యార్థినుల్లో దాగిన ప్రతిభను వెలికితీసే విధంగా మంగళవారం వరకు ఈ పోటీలు నిర్వహించనున్నారు. సోమవారం ఉదయం 10 గంటలకు అమ్మవారికి విశేషపూజల అనంతరం కళాశాల గౌరవ కరస్పాండెంట్ ఊటుకూరు శరత్‌కుమార్ ప్రారంభించిన ఈ పోటీల్లో తొలిరోజు 464 మంది విద్యార్థినులు సంప్రదాయ వస్త్రధారణలతో పాల్గొన్నారు. ఫోటో ఫ్రేమ్‌మేకింగ్, గాజుల డిజైనింగ్, వైర్‌లెస్ కుకింగ్, ట్రెడిషనల్ మేకవర్ పోటీల్లో ఆసక్తిగా పాల్గొని బహుమతులు గెలుచుకున్నారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ పీబీవనిత, అధ్యాపకురాళ్లు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. మంగళవారం ఉదయం 10 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు గ్రూప్ సింగింగ్, గ్రూప్ డాన్స్ తదితర పోటీలు నిర్వహించనున్నట్లు ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ డా.భరణికుమారి, కన్వీనర్ వీఎస్.రమ్యలు తెలిపారు.





సొరంగ మార్గాన్ని రిబ్బన్ కట్‌చేసి ప్రారంభిస్తున్న డిప్యూటీ సీఎం ఉదయనిధి, మంత్రులు శేఖర్‌బాబు, నెహ్రూ, మేయర్ ప్రియ, డిప్యూటీ మేయర్ మహేష్‌కుమార్

రాయపురంలో రూ.30.13 కోట్లతో సొరంగ మార్గం

● ప్రారంభించిన డిప్యూటీ సీఎం

ప్యారీస్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాయపురం శాసనసభ నియోజకవర్గం భోజరాజ నగర్‌లో రూ.30.13 కోట్లతో నిర్మించిన సొరంగ మార్గాన్ని డిప్యూటీ సీఎం ఉదయనిధి సోమవారం ప్రారంభించారు. రాయపురం జోన్‌లోని కొరుక్కుపేటలో ఉన్న భోజరాజన్‌నగర్ చుట్టు పక్కల ఉన్న రైలు మార్గంలో గేట్లు ఎక్కువ సమయం మూసివేయడం వల్ల వాహనాలు నడిపేవారు, ఆ గేట్లకు ఇరువైపులా గంటల తరబడి వేచివుండి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆ ప్రాంతంలోని ప్రజల కోరిక మేరకు భోజరాజనగర్‌లో సొరంగమార్గం నిర్మాణం పనులను 2023లో గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ప్రారంభించింది. 207 మీటర్ల పొడవు, 37 మీటర్ల వెడల్పుతో నిర్మించిన ఈ సొరంగ మార్గంలో వర్షాకాలంలో నిలిచిన నీటిని తొలగించేందుకు 80 హార్స్ పవర్ కలిగిన మోటర్ వసతి కల్పించారు. ఈ సొరంగ మార్గం సమీపంలోనే చిన్నారుల కోసం రూ.1.41 కోట్లతో పార్కు, ప్లేగ్రౌండ్ తదితరాలు కూడా నిర్మించారు. వీటిని సోమవారం ప్రజలకు డిప్యూటీ సీఎం ఉదయనిధి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ కార్యక్రమంలో మంత్రి శేఖర్ బాబు, మేయర్ ప్రియ, ఎమ్మెల్యేలు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

అసెంబ్లీ ఎన్నికల్లో విజయం మాదే

● విజయ్ ధీమా



అడయార్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో విజయం తమదేనని టీవీకే అధ్యక్షుడు, సినీ హీరో విజయ్ ధీమా వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ప్రకటన విడుదల చేశారు. పార్టీ స్థాపించినప్పటి నుంచి ప్రజలతో కలిసిపోయి, వారితో మమేకమైన పార్టీగా వచ్చే ఎన్నికల్లో నిరూపించబోతున్నట్టు విజయ్ వెల్లడించారు. మన లక్ష్యాన్ని చేరుకునేందుకు, మన కలల్ని నెరవేర్చుకునేందుకు కొన్ని నెలల సమయం మాత్రమే ఉందన్నారు. 1967, 1977లో వచ్చిన ఎన్నికల ఫలితాలను మళ్లీ 2026లో చూడబోతున్నామని వెల్లడించారు. మహా ప్రజాశక్తిగా ఉన్న మీరంతా కలిసి ఈ కలను నెరవేర్చబోతున్నట్టు పేర్కొన్నారు. 'తమిళ ప్రజలను ప్రాణానికి ప్రాణంగా భావించే ఈ విజయ్ గురించి మీకు బాగా తెలుసు. వచ్చే ఎన్నికల్లో మన పార్టీ విజయం కోసం అభిమానులు, యువతీ యువకులు, మహిళలు, పురుషులు, వృద్ధులు ఇలా చిన్నా పెద్దా అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి' అని పిలుపునిచ్చారు. కేవలం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా మనసాక్షి ఉన్న ప్రజాపాలన అందిస్తామని, ఇందుకోసం అధికార లక్ష్యం దిశగా పయనిస్తామని, వచ్చే ఎన్నికల్లో తమిళ గడ్డపై సరికొత్త ఫలితాన్ని చూపించడం ఖాయమన్నారు. ఎన్నికలు అనే రాజకీయ యుద్ధంలో గెలుస్తామని, అంతా మంచే జరుగుతుందని, విజయం తథ్యమని విజయ్ ధీమా వ్యక్తం చేశారు.



కాశీమేడులో రూ.15 కోట్లకు

చేపల విక్రయాలు

అడయార్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక కాశీమేడు ఫిషింగ్ హార్బర్‌లో ఆదివారం ఒక్కరోజే ఏకంగా రూ.15 కోట్ల విలువైన చేపల వ్యాపారం జరిగింది. నడి సముద్రంలోకి వెళ్లి చేపలను వేటాడిన జాలర్లు ఆదివారం వేకువజామునకే తీరానికి చేరుకున్నారు. ఇలా వచ్చిన తాజా చేపలను కొనుగోలు చేసేందుకు నగరవాసులు పోటీపడ్డారు. ఫలితంగా వంజరం చేప కిలో ధర రూ.1000కి పైగా పలికింది. అలాగే, వెళ్లై వవ్వాల్ చేపలు కిలో రూ.1300కు పైగా పలికింది. అలాగే, కారప్పొడి రకం చేపలు కిలో రూ.500 చొప్పున ధర పలికింది.

ఐదు నిమిషాల్లో ఫుల్

● దీపావళి స్పెషల్ రైళ్ల టిక్కెట్ల రిజర్వేషన్
● 2 రోజులకు ముందే సొంతూళ్లకు పయనం



అడయార్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ రద్దీని నివారించే నిమిత్తం నడిపే ప్రత్యేక రైళ్లలో ప్రయాణించేందుకు ముందస్తు రిజర్వేషన్ టిక్కెట్లు బుకింగ్స్ సోమవారం ప్రారంభమైంది. ఆన్‌లైన్‌లో బుకింగ్ విండో ప్రారంభించగానే కేవలం ఐదు నిమిషాల్లోనే ఆ టిక్కెట్లన్నీ హాట్ కేకుల్లా ఫుల్ అయ్యాయి. దీపావళి పండుగ కోసం సొంతూళ్లకు ప్రయాణికుల కోసం రైల్వే శాఖ ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. ఈ రైళ్లలో ప్రయాణించే వారు 60 రోజులకు ముందుగానే టిక్కెట్లను ముందస్తుగా బుక్ చేసుకునే వెసులుబాటును కల్పిస్తోంది. ఇందులోభాగంగా, సోమవారం ఈ టిక్కెట్ల బుకింగ్ ప్రారంభమైంది. అక్టోబరు 17వ తేదీ శుక్రవారం రోజున సొంతూళ్లకు వెళ్లేందుకు ప్రయాణికులు టిక్కెట్లను బుక్ చేసుకునేందుకు పోటీపడ్డారు. ఈ ముందస్తు రిజర్వేషన్ ప్రారంభమైన వెంటనే అన్ని టిక్కెట్లు కొన్ని క్షణాల్లోనే అమ్ముడుపోయాయి. ముఖ్యంగా మదురై, తిరునెల్వేలి, తెన్‌కాశి, తూత్తుక్కుడి, కన్నియాకుమారి, తిరుచ్చెందూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లలోని సెకండ్ క్లాస్ టిక్కెట్లన్నీ 5 నిమిషాల్లో బుక్ అయ్యాయి. అదేవిధంగా తిరుచ్చి, రామేశ్వరం, కుంభకోణం, తంజావూరు ప్రాంతాల మీదుగా వెళ్లే రైళ్లలో కూడా టిక్కెట్లు ఫుల్ అయ్యాయి. కోయంబత్తూరు, ఈరోడ్, తిరుప్పూరు వైపు వెళ్లే చేరన్, ఏర్కాడు, బ్లూమౌంటైన్ తదితర ఎక్స్‌ప్రెస్‌లలో కూడా టిక్కెట్లు ఫుల్ అయ్యాయి. ఈ టిక్కెట్లలో అత్యధిక భాగం ఆన్‌లైన్‌లోనే బుక్ కావడం గమనార్హం. ఈ టిక్కెట్ల కోసం రిజర్వేషన్ కౌంటర్ల వద్ద క్యూలలో గంటల తరబడి నిలబడివున్న పలువురు ప్రయాణికులు ఉసూరుమంటూ వెనుదిరిగారు. బస్సులతో పోల్చితే చార్జీలు తక్కువగా ఉండడంతో రైళ్లలో ప్రయాణించేందుకు ఆసక్తి చూపడంతో టిక్కెట్లు హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి.

ఉధృతంగా కావేరి

కర్ణాటక నుంచి అదనపు జలాలతో నిండు కుండలా మేట్టూరు ● 23 వరకు వర్షాలు



ఉధృతంగా పారుతున్న కావేరి నది

ప్యారీస్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వాయువ్య బంగాళాఖాతంలో ఆదివారం ఏర్పడిన అల్పపీడనం సోమవారం నాటికి వాయుగుండంగా మారింది. దీని ప్రభావం వల్ల ఈనెల 23వ తేదీ వరకు పలుప్రాంతాల్లో భారీ నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని ప్రాంతీయ వాతావరణ పరిశోధన కేంద్రం హెచ్చరించింది. బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం వాయుగుండంగా బలపడుతోందని, ఇందువల్ల రాష్ట్రం, పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో సోమవారం నుంచి ఈనెల 23న శనివారం వరకు వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ రోజుల్లో బంగాళాఖాతంలో 50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని జాలర్లు చేపల వేటకు వెళ్లరాదని వాతావరణ శాఖ హెచ్చరించింది. రాష్ట్రంలో సోమవారం ఉదయం 8 గంటల వరకు గరిష్ఠంగా కోవై జిల్లా చిన్నకల్లారులో 90 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వాల్పారైలో 70మి.మీ., షోళయారు, నీలగిరి ప్రాంతాల్లో తలా 50 మి.మీ కురిసింది. ఈ నేపథ్యంలో, కోస్తా జిల్లాలకు చెందిన ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిందిగా వాతావరణశాఖ సూచించింది.

ఉధృతంగా మేట్టూరు డ్యాం...

రాష్ట్రంలో డెల్టా జిల్లాల మీదుగా ప్రవహిస్తున్న కావేరి నదిలో ప్రవాహం ఉధృతంగా కొనసాగుతోంది. పొరుగు రాష్ట్రమైన కర్ణాటకలోని డ్యాంల నుంచి విడుదల చేస్తున్న మిగుల జలాల రాక, మరోవైపు ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షాల ప్రభావంతో సేలం జిల్లా మేట్టూరు డ్యాం నీటిమట్టం సోమవారం ఉదయం 8 గంటలకు పూర్తి సామర్థ్యానికి చేరడంతో డ్యాం నుంచి సెకనుకు 75వేల ఘనపుటడుగుల జలాలను దిగువకు విడుదల చేస్తున్నట్లు ప్రజా పనులశాఖ కావేరి పరీవాహక జిల్లాల ప్రజలకు హెచ్చరికలు జారీ చేసింది. కర్ణాటకలో అతిభారీగా కురుస్తున్న వర్షాల కారణంగా ఆ రాష్ట్రంలోని కబిని డ్యాం నిండింది. దీంతో అక్కడి నుంచి సెకనుకు 25వేల ఘనపుటడుగుల నీటిని కావేరి నదికి మళ్లిస్తున్నారు. అదే విధంగా కృష్ణరాజసాగర్ డ్యాం నుంచి సెకనుకు 75వేల ఘనపుటడుగుల నీరు విడుదల చేస్తున్నారు. ఈ రెండు డ్యాంల నుంచి నీటి రాకతో మేట్టూరు డ్యాంలో క్రమక్రమంగా నీటిమట్టం పెరుగుతోంది. కావేరి నదిలో నీరు ఉధృతంగా పారుతుండడంతో మేట్టూరు డ్యాం భద్రతను దృష్టిలో ఉంచుకుని సెకనుకు 50వేల నుంచి 75వేల ఘనపుటడుగుల మిగుల జలాలను విడుదల చేస్తున్నట్లు ప్రకటించి ప్రజాపనులశాఖ అధికారులు ప్రకటించారు. కావేరి నది ప్రవహించే ప్రాంతాల్లో స్నానాలకు నీటిలో దిగరాదని, వరద ప్రవాహాన్ని సెల్ఫీలు తీసుకోరాదని, మత్స్యకారులు చేపలవేటకు వెళ్లరాదని హెచ్చరించారు.

సమాచార దృశ్యిని

నీలగిరిలో టైడల్ పార్కుకు టెండర్ల ఆహ్వానం

పెరంబూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలో మినీ టైడల్ పార్కు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. రాష్ట్రంలో సమాచార సాంకేతిక రంగం (ఐటీ)ని టైర్-2, టైర్-3 నగరాల్లో విస్తరించేలా మినీ టైడల్ పార్కులు ఏర్పాటు చేస్తామని శాసనసభ సమావేశాల్లో మంత్రి తంగం తెన్నరసు ప్రకటించారు. ఈ ప్రకారం, తొలివిడతగా వేలూరు, నీలగిరి జిల్లాల్లో మినీ టైడల్ పార్కుల ఏర్పాటు పనులు ప్రారంభించారు. నీలగిరి జిల్లా కున్నూర్ ఎడపల్లి సమీపంలో 8 ఎకరాల్లో ఏర్పాటుకానున్న టైడల్ పార్కు పనులకు ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించింది. ఈ టైడల్ పార్కు ఏర్పాటుతో 1,000 మందికి ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

తగ్గిన విద్యుత్ వినియోగం

పెరంబూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రోజువారీ విద్యుత్ వినియోగం సరాసరిన 16,000 మెగావాట్లు ఉండగా, వేసవిలో 20,000 మెగావాట్లు దాటుతోంది. ఈ నెల ఎండలు, వేడి గాలులు తదితర కారణాలతో రోజువారీ విద్యుత్ వినియోగం 17,000 మెగావాట్లుగా నమోదైంది. ఈ క్రమంలో, శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం, శనివారం కృష్ణ జయంతి సందర్భంగా అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, కొన్ని ప్రైవేటు కార్యాలయాలకు సెలవు ప్రకటించారు. అలాగే పలువురు సెలవుల్లో ఆనందంగా గడిపేందుకు సొంతూళ్లకు వెళ్లారు. ఈ కారణంగా శనివారం విద్యుత్ వినియోగం 3,000 మెగావాట్లు తగ్గి 14,000 మెగావాట్లుగా నమోదైందని విద్యుత్ బోర్డు అధికారులు తెలిపారు.

25వరకు పింఛన్‌దారుల సమస్యలపై దరఖాస్తుల స్వీకరణ

పెరంబూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): చెన్నై జిల్లాకు చెందిన పింఛన్‌దారులు.. పింఛన్ పొందడంలో తలెత్తుతున్న సమస్యలు, ఇతరాలపై ఈనెల 25వ తేది దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ రష్మి సిద్ధార్థ్ జగడే ప్రకటించారు. చెన్నై జిల్లాలోని రాష్ట్ర ప్రభుత్వ వివిధ శాఖల్లో పనిచేసి పదవీవిరమణ పొంది పింఛన్ పొందుతున్న వారి సమస్యలు పరిష్కరించేలా సెప్టెంబరు 12వ తేది (శుక్రవారం) ఉదయం 10.30 గంటలకు చెన్నై జిల్లా కలెక్టరేట్‌లోని 8వ అంతస్తులో ఉన్న సమావేశ మందిరంలో సమావేశం జరుగనుంది. పింఛన్లపై సమస్యలను 'జిల్లా కలెక్టర్, చెన్నై జిల్లా కలెక్టర్ కార్యాలయం, నెం.62, రాజాజీ రోడ్డు, చెన్నై-1' అనే చిరునామాకు ఈనెల 25వ తేదిలోపు దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.

కోస్టల్ హోం గార్డ్స్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): జాలర్ల కుటుంబాలకు చెందిన యువకులు కోస్టల్ హోం గార్డ్స్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈమేరకు గ్రేటర్‌చెన్నై హోంగార్డ్స్ విభాగం విడుదల చేసిన ప్రకటనలో... అభ్యర్థులు చెన్నై నగరం, చుట్టుపక్కల 20కి.మీ దూరంలోపు నివాసం ఉంటూ, 18 నుంచి 50 ఏళ్లలోపు ఉండి, టెన్త్ ఫెయిల్/పాస్ అయి ఉండాలి. ఎలాంటి నేర చరిత్ర లేకుండా సముద్రంలో ఈత తెలిసిన వారుగా ఉండాలి. ఎంపికైన వారికి45 రోజులు శిక్షణ ఇవ్వనున్నారు. నైట్ రౌండ్స్, డే ప్రోటోకాల్ పనులు చేపట్టనున్న కోస్టల్ హోంగార్డ్స్‌కు ప్రత్యేక అలవెన్స్‌గా రోజుకు రూ.560 అందించనున్నారు. ఆసక్తి కలిగిన వారు సైదాపేట పోలీస్‌స్టేషన్ కాంప్లెక్స్‌లోని గ్రేటర్‌చెన్నై హోంగార్డ్ కార్యాలయంలో సెప్టెంబరు 30లోపు దరఖాస్తులు సమర్పించాలి. వివరాలకు 95667 76222, 94981 35373 నెంబర్లలో సంప్రదించవచ్చు.

ఐదు ఉచిత 'ఏఐ' ఆధారిత కోర్సులు

పెరంబూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ఐదు ఉచిత ఏఐ ఆధారిత కోర్సులు అందించనుంది. దేశంలోని పాఠశాలలు, కళాశాలల విద్యార్థుల్లో నైపుణ్యం పెంచేలా కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ స్వయం, దీక్ష, ఎన్‌పీటీఈఎల్ తదితర డిజిటల్ ప్లాట్‌ఫాంల ద్వారా ఉచిత ఆన్‌లైన్ కోర్సులు అందిస్తోంది. ఈ నేపథ్యంలో, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతలు ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా భారీ ప్రభావం చూపుతున్నాయి. కేంద్రప్రభుత్వం తన స్వయం ప్లాట్‌ఫాంపై ఏఐ సాంకేతికత ఆధారంగా ఉచిత కోర్సులు అందిస్తోంది. ఇందులో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్-మెషిన్ లెర్నింగ్ క్రిటికల్ అనాలిసిస్ త్రూ ఏఐ, ఫిజిక్స్ ఏఐ, కెమిస్ట్రీ ఏఐ, అకౌంటింగ్ ఏఐ తదితర ఐదు రకాల కోర్సులు అందిస్తోంది. ఇందులో, క్రిటికల్ అనాలసిస్ త్రూ ఏఐ కోర్సును ఐఐటీ చెన్నై ప్రొఫెసర్లు రూపొందించారు. మరిన్ని వివరాలు, పేరు నమోదుకు విద్యార్థులు https://swayamplus.swayam2.ac.in./లో సంప్రదించవచ్చు.

రూ.500 కోట్లతో సెమి కండక్టర్ ప్రాజెక్ట్

పెరంబూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ జిల్లా పల్లడంలో 100 ఎకరాల్లో సెమి కండక్టర్ మూవ్‌మెంట్ ప్రాజెక్ట్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.500 కోట్లు కేటాయిస్తూ జీవో విడుదల చేసింది. ఈ ప్రాజెక్ట్‌లో సెమి కండక్టర్ డిజైన్ డెవలప్‌మెంట్, సెమి కండక్టర్ టెస్టింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ సహా ఐదు ప్రాజెక్ట్‌లు ఏర్పాటు చేయనున్నారు. యువతకు నైపుణ్య శిక్షణ అందించడానికి ఈ ప్రాజెక్ట్ కింద 1,000 మంది కళాశాల విద్యార్థులకు శిక్షణ అందించేలా ప్రణాళిక రూపొందించినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపింది.

దేవకీ నందనుడి పురవిహారం





తిరుత్తణి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులో శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకుని సోమవారం సాయంత్రం రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణ భగవానుడి గ్రామోత్సవం జరిగింది. ఐదురోజులు జరుగనున్న వేడకల్లో భాగంగా ఆ ప్రాంత యాదవ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఉదయం జరిగిన పూజల్లో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని శ్రీకృష్ణుడి నామసంకీర్తనలతో పరవశించిపోయారు. సాయంత్రం 6 గంటలకు పుష్పాలతో అలంకరించిన రుక్మిణి, సత్యభామ సమేత శ్రీకృష్ణ భగవానుడి ఉత్సవమూర్తుల గ్రామోత్సవం కన్నులపండువగా జరిగింది. పళ్లిపట్టు యాదవ సంఘ నాయకులు, కౌన్సిలర్ విజయాలు యాదవ్, మునికృష్ణ నాటామా, పరుశురామ్ యాదవ్, గోపాల్‌యాదవ్, సుధాయాదవ్, అబ్బా, భాస్కర్, గోపియాదవ్, సూరిబాబు, హేమాద్రి, ఎం.విజయాలు, పి.దామోదరం తదితరులు పాల్గొన్నారు.

టీవీకే జెండాకు వ్యతిరేకంగా దాఖలైన కేసు తోసివేత

పెరంబూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): టీవీకే జెండాను నిషేధించేందుకు హైకోర్టు నిరాకరించింది. తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ 'ఎరుపు, పసుపు, ఎరుపు' రంగులతో రూపొందించిన జెండా.. తమ జెండాలా ఉందని, అందువల్ల దాన్ని నిషేధించాలని కోరుతూ మద్రాసు హైకోర్టులో తొండై మండల సాన్రోర్ ధర్మ పరిపాలన సభ చైర్మన్ పచ్చయప్పన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ సోమవారం విచారణకు రాగా, 80 లక్షల మంది సభ్యులున్న టీవీకే, తమ చిన్న సంస్థ తొండై మండల సాన్రోర్ ధర్మ పరిపాలన సభను కబళించే యత్నాలు అంగీకరించలేమని పిటిషన్‌దారుడు తరఫున వాదించారు. అదే సమయంలో, టీవీకే జెండా వల్ల తమకు ఎలాంటి నష్టం వాటిల్లుతుందో పిటిషన్‌దారుడు వివరించలేదని, అందువల్ల పిటిషన్ తోసివుచ్చాలని టీవీకే తరఫున వాదించారు. వాదనల అనంతరం న్యాయమూర్తి, తండై మండల సాన్రోర్ ధర్మ పరిపాలన సభ జెండాను టీవీకే ఉపయోగించారని చెప్పలేమని, రెండు జెండాలు పోల్చి చూస్తే, టీవీకే జెండాతో గందరగోళం ఏర్పడుతుందని చెప్పలేమన్న న్యాయమూర్తి, పచ్చయప్పన్ పిటిషన్ తోసిపుచ్చారు.

పనయూర్ నుంచి బయటకు రండి

● విజయ్‌కు మాజీ మంత్రి సెల్లూర్ రాజు హితవు

అడయార్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పనయూర్ బంగ్లా నుంచి బయటకు వచ్చి ప్రజలను కలుసుకుని రాజకీయాలు చేయాలని తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు విజయ్‌కు అన్నాడీఎంకే మాజీ మంత్రి సెల్లూర్ రాజు హితవు పలికారు. మదురైలో ఆయన మీడియాతో మాట్లాడుతూ... ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అధికారులు ఎప్పుడు తమపై దాడిచేస్తారో అని డీఎంకే మంత్రులు హడలిపోతున్నారన్నారు. ఇప్పటికే పలువురు మంత్రులు బెయిలుపై తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. కొత్త పార్టీ ప్రారంభించిన విజయ్, తన బంగ్లా నుంచే ప్రకటనలు, నేతలు నివాళి తదితరాలు చేపడుతున్నారని, మహానాడు పేరుతో జనసమీకరణ చేస్తున్నారని, ఇలాంటి చర్యలతో ఆయనకు ఓట్లు రావన్నారు. పనయూర్ బంగ్లా నుంచి బయటకు రాకపోతే రాబోయే ఎన్నికల అనంతరం ఆ పార్టీ కనుమరుగు అవుతుందని సెల్లూరు రాజు తెలిపారు.

ఎంబీబీఎస్ సీట్ల కోసం మధ్యవర్తులను ఆశ్రయించొద్దు

● పోలీస్ కమిషనర్ అరుణ్ హెచ్చరిక

అడయార్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్ సీటు కోసం మధ్యవర్తులను నమ్మి మోసపోవద్దని నగర పోలీస్ కమిషనర్ అరుణ్ సూచించారు. నీట్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థుల మార్కుల ఆధారంగా వైద్య కళాశాలల్లో అడ్మిషన్లు పొందేలా ర్యాంకుల జాబితా తయారుచేశారన్నారు. ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్ ద్వారా మాత్రమే కౌన్సెలింగ్, సీటు కేటాయింపు జరుగుతుందన్నారు. నగర పోలీసు శాఖ నిర్వహిస్తున్న ప్రజా గ్రీవెన్స్‌లో పలువురు వైద్య కళాశాలలలో సీటు ఇప్పిస్తామని నగదు మోసానికి పాల్పడినట్లు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఈ విషయమై తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ సూచించారు.

ఇద్దర్ని మింగిన నిద్రమత్తు

● టిప్పర్ ఢీకొన్న మినీ వ్యాన్

● ఇద్దరి దుర్మరణం, పలువురికి స్వల్ప గాయాలు



కొడవలూరు, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): బంధువుల పెళ్లికి వెళ్లామన్న ఆనందం వారిలో ఎంతోసేపు నిలవలేదు. నిద్రమత్తు డ్రైవర్‌తోపాటు ఆ ఇంటి పెద్ద దిక్కును పొట్టన పెట్టుకుంది. నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం నాయుడుపాలెం వద్ద జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున ఆగి ఉన్న టిప్పర్‌ను మినీవ్యాన్ ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. పోలీసుల కథనం మేరకు ... చెన్నైకు చెందిన మాధవ్ కావలిలో ఉంటున్న బంధువుల పెళ్లిలో పాల్గొనేందుకు ఐదుగురు కుటుంబసభ్యులతో మినీ వ్యాన్‌లో ఆదివారం వచ్చారు. సోమవారం తెల్లవారుజామున 2.30 గంటలకు చెన్నైకు బయలుదేరారు. మార్గమధ్యంలోని నాయుడుపాలెం వద్ద 3.30 గంటల సమయంలో చెన్నై-కోల్‌కాతా జాతీయ రహదారిపై వెళ్తుండగా డ్రైవర్ కునుకు తీయడంతో ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీ కొట్టింది. డ్రైవర్ హుస్సేన్ (42), మాధవ్‌రావు (45) అక్కడికక్కడే మృతి చెందారు. వెనుక కూర్చుని ఉన్న కుటుంబ సభ్యులు స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న ఎస్ఐ కోటిరెడ్డి సంఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాలను నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహాగణపతి ఆలయంలో చవితి వేడుకలు ప్రారంభం



ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

పెరంబూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి ఏకాక్షర మహా గణపతి ఆలయంలో చవితి వేడుకలు ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. వివేకానందపురంలో ఈ ఆలయంలో యేటా ఆవణి నెలలో చవితి వేడుకలు 10 రోజులు వైభవంగా నిర్వహిస్తుంటారు. ఈ క్రమంలో సోమవారం ఉత్సవాలు ప్రారంభం కాగా, 27వ తేది వరకు జరుగనున్నాయి. వేడుకల పూర్వాంగ పూజలు ఆదివారం రాత్రి నిర్వహించారు. వేడుకల్లో తొలిరోజైన సోమవారం ఉదయం ధ్వజారోహణం చేశారు. తొలుత ధ్వజస్తంభానికి పత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేళతాళాల మధ్య ఉదయం 10 గంటలకు ధ్వజస్తంభంపై పతాకం ఎగురవేశారు. వేడుకల్లో ప్రతిరోజు ఉదయం యాగశాల పూజ, అభిషేకం, దీపారాధన నిర్వహించనున్నారు. 6వ రోజైన 23న రాత్రి 7 గంటలకు 108 కుంభ కలశ పూజ, 27న ఉదయం 9 గంటలకు 108 కలశ అభిషేకం, మధ్యాహ్నం 12 గంటలకు ప్రత్యేక అలంకరణ, దీపారాధనలు జరుగనున్నాయి. వినాయక చవితి రోజైన 27వ తేది ఉదయం 9.30 గంటలకు వినాయకుడికి యాగ కలశ అభిషేకం, అష్ట కలశ అభిషేకం, 10.30 గంటలకు 21 రకాల అభిషేకాలు, సాయంత్రం 5 గంటలకు మంగళ సంగీతం, సాయిరక్ష దీపారాధన నిర్వహించనున్నారు. అనంతరం ఉత్సవమూర్తికి పురవీధుల్లో ఊరేగించనున్నారు. 28న వివేకానంద కేంద్ర సముద్ర తీరంలో వినాయకుడికి తీర్థవారి కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు.

● శంకరన్‌కోవిల్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక

డీఎంకే హస్తగతం



మున్సిపల్ చైర్మన్ కౌసల్య

ప్యారీస్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లా శంకరన్‌కోవిల్ మున్సిపల్ చైర్మన్ ఎన్నికల్లో డీఎంకేకు చెందిన కౌసల్య విజయం సాధించారు. ఆమెకు డీఎంకే నిర్వాహకులు, మిత్రపక్షాల నేతలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ మున్సిపాలిటీలో 30 వార్డులుండగా, గత స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్నాడీఎంకే 12 స్థానాలు, డీఎంకే 9 స్థానాలు, ఎండీఎంకే 2 స్థానాలు, కాంగ్రెస్, ఎస్‌డీపీఐలు తలా ఒక వార్డులో, ఇండిపెండెంట్లు 5 వార్డుల్లో గెలుపొందారు. మున్సిపల్ చైర్మన్ పదవికి డీఎంకేకు చెందిన ఉమా మహేశ్వరి, అన్నాడీఎంకే తరుపున ముత్తులక్ష్మి పోటీపడ్డారు. ఇందులో ఇద్దరికి తలా 15ఓట్లు రావడంతో డ్రా నిర్వహించారు. ఇందులో ఉమా మహేశ్వరి ఎంపికై పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో, డీఎంకే, అన్నాడీఎంకే సహా 24 మంది కౌన్సిలర్లు ఉమా మహేశ్వరికి వ్యతిరేకంగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టారు. దీంతో గత జూన్ 2వ తేదీ అవిశ్వాస తీర్మానంపై మూజువాణి ఓటింగ్ నిర్వహించగా మొత్తం సభ్యుల్లో తీర్మానానికి మద్దతుగా 28 మంది ఓటువేయడంతో ఉమామహేశ్వరి తన పదవిని కోల్పోయారు. ఆ తర్వాత ఆ మున్సిపాలిటీలో ఖాళీ ఏర్పడిన పదవికి సోమవారం పటిష్ఠ పోలీస్ బందోబస్తు మధ్య ఎన్నికలు నిర్వహించారు. ఇందులో 6వ వార్డు కౌన్సిలర్ కౌసల్య, 26వ వార్డు కౌన్సిలర్ అన్నామలై పుష్పం పోటీ చేయగా, కౌసల్య 22 ఓట్లు పొంది గెలుపొందినట్లు మున్సిపల్ కమిషనర్ అధికారిపూర్వకంగా ప్రకటించారు.

రాష్ట్రవ్యాప్తంగా 12 మంది డీఎస్పీల బదిలీ

పెరంబూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా 12 మంది డీఎస్పీలను బదిలీ చేస్తూ డీజీపీ శంకర్ జివాల్ ఉత్తర్వులు జారీచేశారు. తిరుప్పూర్ నగర క్రైం రికార్డ్స్ అసిస్టెంట్ కమిషనర్ సెంగుట్టువన్ చెన్నై మెట్రోపాలిటన్ క్రైం బ్రాంచ్‌కు, చెన్నైలోని సీఐడీ నార్కోటిక్స్ కంట్రోల్ యూనిట్ డీఎస్పీ రాఘవి చెన్నై మెట్రోపాలిటన్ క్రైం బ్రాంచ్‌కు, తిరువళ్లూర్ జిల్లా క్రైం బ్రాంచ్ డీఎస్పీ మణిమేఘలై చెన్నై మెట్రోపాలిటన్ క్రైం బ్రాంచ్‌కు, చెన్నై సెంబియం అసిస్టెంట్ కమిషనర్ ముహేష్ జయకుమార్ చెన్నై మీనంబాక్కం అసిస్టెంట్ కమిషనర్‌గా, తమిళనాడు డైరెక్టర్ ఆఫ్ పోలీసు కార్యాలయంలో సోషల్ మీడియా సెంటర్ డీఎస్పీ రవీంద్రన్ అయనావరం అసిస్టెంట్ కమిషనర్‌గా నియమితులయ్యారు. వీరితో పాటు నగరంలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 11 మంది డీఎస్పీలు బదిలీ అయ్యారు.

ఇందిరా నగర్‌లో రూ.4.40 కోట్లతో 'ఫుడ్ కోర్ట్'

పెరంబూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక అడయార్ ఇందిరానగర్‌లో ఉన్న కార్పొరేషన్ వాణిజ్య కాంప్లెక్స్‌లో 'ఫుడ్ కోర్ట్' ఏర్పాటుకు రూ.4.40 కోట్లు చెన్నై కార్పొరేషన్ కేటాయించింది. అడయార్ మండలం 173వ వార్డు ఇందిరానగర్ 3వ అవెన్యూలో కార్పొరేషన్ వాణిజ్య కాంప్లెక్స్‌లో 15కు పైగా దుకాణాలున్నాయి. ఈ ప్రాంగణంలోని ఒక భాగం శిథిలావస్థకు చేరడంతో దాన్ని కూల్చివేసి, కొత్తగా 'ఫుడ్ కోర్ట్' ఏర్పాటుచేయాలని నిర్ణయించిన కార్పొరేషన్, రూ.4.40 కోట్లు కేటాయించింది. ఫుడ్ కోర్ట్ నిర్మాణపనులు త్వరలో చేపట్టనున్నట్లు అధికారులు తెలిపారు.

జగద్రక్షకన్‌కు వ్యతిరేకంగా ఈడీ నోటీసుపై స్టే

పెరంబూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ఎంపీ జగద్రక్షకన్‌ను వ్యతిరేకంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) నోటీసుకు సుప్రీంకోర్టు స్టే విధించింది. సింగపూర్‌కు చెందిన సంస్థలో 70 లక్షల షేర్లను రూ.32.69 కోట్లకు రిజర్వ్ బ్యాంక్ అనుమతి లేకుండా కొనుగోలు చేసిన జగద్రక్షకన్ ఈ షేర్లను తన భార్య పేరుకు బదిలీ చేశారని ఆరోపణలున్నాయి. సింగపూర్ సిల్వర్ పార్క్ కంపెనీ షేర్ల కొనుగోలు విదేశీ మారకద్రవ్యం చట్టాన్ని ఉల్లంఘించారంటూ ఈడీ విచారణ చేపట్టింది. ఈ వ్యవహారంలో విచారణకు హాజరుకావాలని జగద్రక్షకన్, ఆయన కుటుంబ సభ్యులకు ఈడీ నోటీసు జారీచేసింది. ఈడీ నోటీసుకు వ్యతిరేకంగా జగద్రక్షకన్ దాఖలుచేసిన పిటిషన్‌ను మద్రాసు హైకోర్టు తోసిపుచ్చడంతో, ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

ఆ ఆరోపణలపై సంజాయిషీ ఇవ్వండి

అన్బుమణికి పీఎంకే నోటీసులు

చెన్నై, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అన్బుమణిపై చర్యలు చేపట్టేందుకు 16 ఆరోపణలతో క్రమశిక్షణ కమిటీ పీఎంకే అధ్యక్షుడు రాందాస్‌కు నివేదిక అందజేసిన నేపథ్యంలో, ఆయన సంజాయిషీ కోరుతూ నోటీసు జారీ చేశారు. ఏడు రోజుల్లోపు సంజాయిషీ ఇవ్వని పక్షంలో అన్బుమణిపై చర్యలు చేపడతామని స్పష్టం చేసింది. విల్లుపురం జిల్లా పట్టానూరులోని ఓ ప్రైవేటు కల్యాణ మండపంలో ఆదివారం పీఎంకే ప్రత్యేక సర్వసభ్య సమావేశం జరిగింది. పార్టీ అధ్యక్షుడు రాందాస్ నేతృత్వంలో జరిగిన సమావేశంలో 37 తీర్మానాలు ఆమోదించారు. అధ్యక్షుడిగా రాందాస్ కొనసాగింపు, రాబోయే శాసనసభ ఎన్నికల్లో పోటీ చేయడం తదితరాలపై నిర్ణయం తీసుకునే అధికారం రాందాస్‌కు ఇస్తూ తీర్మానించారు. ఈ సమావేశంలో 8 మందితో కూడిన క్రమశిక్షణ కమిటీ, అన్బుమణిపై 16 ఆరోపణలు చేస్తూ నివేదిక అందజేసింది. అందులో... పార్టీకి, రాందాస్‌కు వ్యతిరేక చర్యలు, పార్టీకి కళంకం తెచ్చేలా వ్యవహరిస్తున్న తీరు, రాం దాస్ కుర్చీ పక్కనే ఆడియో రికార్డర్ ఉంచడం, అన్బుమణి నిర్వహించిన సర్వసభ్య మండలిలో ఖాళీ కుర్చీలు చూపించి రాం దాస్‌ను కించపరిచడం సహా 16 ఆరోపణలు ఉన్నాయి. వాటిపై సంజాయిషీ ఇవ్వాలని కోరింది.

ఆర్ఎండీ హాస్పిటల్‌కు వాటర్ ప్యూరిఫైయర్ వితరణ



చెన్నై, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక కీల్పాక్కంలోని ఆర్ఎండీ గ్రూప్ ఆఫ్ హాస్పిటల్ అండ్ ట్రస్ట్‌కు లయన్ గ్రిష్మరాతి ఆర్వో వాటర్ ప్యూరిఫైయర్‌ను అందజేసింది. ఆర్ఎండీ ఆస్పత్రి గత 30 ఏళ్లగా క్యాన్సర్ పేషంట్లకు మెరుగైన వైద్య చికిత్సలు అందించడంతో పాటు నిరాశ్రయులైన పేషంట్లకు బస కల్పిస్తోంది. ఆస్పత్రి సేవలను కొనియాడుతూ గ్రిష్మ రాలి ఆర్వో వాటర్ ప్యూరిఫైయర్ అందజేసినట్లు ఆస్పత్రి నిర్వాహకులు తెలిపారు.

మదురై ఆధీనంపై కఠిన చర్యలొద్దు: హైకోర్టు

పెరంబూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మదురై ఆధీనంకు వ్యతిరేకంగా కఠిన చర్యలు చేపట్టరాదని హైకోర్టు తెలిపింది. మతవిద్వేషాలు రెచ్చగొట్టేలా మాట్లాడారంటూ నమోదు చేసిన కేసు కొట్టివేయాలని మదురై ఆధీనం హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సోమవారం విచారించిన హైకోర్టు, దీనిపై సెప్టెంబరు 15వ తేది లోపు అఫిడవిట్ దాఖలు చేయాలని పోలీసు శాఖకు నోటీసు జారీ చేసింది. అప్పటివరకు మదురై ఆధీనంపై ఎలాంటి కఠిన చర్యలు చేపట్టరాదని పేర్కొంది.

అన్నాడీఎంకే మరింత బలపడాల్సి ఉంది

● జన్మదిన వేడుకల్లో వీకే శశికళ

ప్యారీస్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని 30యేళ్లకు పైగా పరిపాలించిన అన్నాడీఎంకే మరింత బలపడడానికి అనుభవం కలిగిన వారి సలహాలను పాటించాలని దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత నెచ్చెలి వీకే శశికళ అభిప్రాయపడ్డారు. స్థానిక పోయెస్ గార్డెన్‌లో ఉన్న నివాసంలో సోమవారం తన 71వ జన్మదినం సందర్భంగా ఆమె తమ మద్దతుదారులతో పేదలకు సంక్షేమ సహాయాలు అందించారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ... డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ఒకమాట, అధికారంలోకి వచ్చాక నాటకమాడుతోందన్నారు. 2020లో జీసీసీలో పనిచేసిన తాత్కాలిక పారిశుధ్య కార్మికుల వ్యవహారంలో అప్పటి సీఎం జయలలిత ఆచీ..తూచి.. వ్యవహరిస్తే, ప్రతిపక్ష నేతగా ఉన్న స్టాలిన్ వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారన్నారు. 2021 డీఎంకే ఎన్నికల మేనిఫెస్టోలో ఈ అంశాన్ని పొందుపరిచి నాలుగేళ్లయినా పర్మినెంట్ చేయలేదన్నారు. ప్రభుత్వానికి ఎన్ని శాఖలున్నాయి? ఎంత మంది కార్యదర్శులున్నారు? వారితో ఎలా పనిచేయించాలో కూడా తెలియని వారు అధికారంలో ఉన్నారన్నారు. ఆచరణకు సాధ్యంకాని హామీల కోసం కోట్లాది మంది ప్రజలు పన్నుల రూపంలో చెల్లించిన నగదును సొంతంగా ఖర్చుచేయడాన్ని ఖండిన్నానన్నారు. గడువు తీరిన టోల్‌గేట్లను మూసివేయడం లేదన్నారు. డిప్యూటీ సీఎం ఉదయనిధి కార్‌రేస్ నిర్వహణకు రూ.200 కోట్లు ప్రభుత్వ సొమ్ము ఖర్చుచేశారన్నారు. నిధులు కేటాయింపుపై కేంద్రప్రభుత్వాన్ని దూషించడమే డీఎంకే ప్రభుత్వం లక్ష్యంగా చేసుకుందని విమర్శించారు.

'పరువు హత్య'లకు ప్రత్యేక కోర్టు

● పుదియ తమిళగం పార్టీ డిమాండ్



కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న కార్యకర్తలు

ప్యారీస్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): పరువు హత్య కేసుల విచారణకు ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయాలని పుదియ తమిళగం పార్టీ అధ్యక్షుడు డాక్టర్ కృష్ణసామి రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తిరునల్వేలిలో ఇటీవల ఐటీ ఉద్యోగి కవిన్ హత్యను ఖండిస్తూ తిరుచ్చి కలెక్టరేట్ సమీపంలో సోమవారం నిర్వహించిన ధర్నాలో పార్టీ కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ధర్నాలో కృష్ణస్వామి మాట్లాడుతూ... కవిన్ పరువు హత్య వ్యవహారంలో సీబీసీఐడీ విచారణ ద్వారా బాధిత కుటుంబానికి న్యాయం జరిగే అవకాశం లేదని, ఈ కేసును సీబీఐ విచారణకు అప్పగించాలని ఆయన కోరారు. తాను 2011 నుంచి 2016 వరకు ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో జరిగిన పరువు హత్యలపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోలేదని, అందుకే రాష్ట్రంలో ఈ దుస్థితి కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

నగరానికి తిరిగొస్తున్న జనం

● ఉళుందూర్‌పేట చెక్‌పోస్ట్‌లో ట్రాఫిక్ రద్దీ



చెక్ పోస్ట్ వద్ద బారులు తీరిన వాహనాలు

అడయార్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): ఉళుందూర్ పేట చెక్‌పోస్ట్ వద్ద వాహనాలు బారులు తీరాయి. స్వాతంత్ర్య దినోత్సవం, శ్రీకృష్ణ జయంతి, ఆదివారం వరుస సెలవులు రావడంతో చెన్నైలో నివసిస్తున్న దక్షిణాది జిల్లాలకు చెందిన ప్రజలు తమ కుటుంబాలతో స్వగ్రామాలకు వెళ్లారు. ప్రభుత్వ, ఆమ్నీ బస్సులు, సొంత వాహనాల్లో వీరు బయల్దేరి వెళ్లారు. సెలవులు ముగియడంతో ప్రజల నగరానికి తిరిగి వస్తున్నారు. ఒకేరోజు బస్సులు, వ్యాన్లు, కార్లు ఇతర వాహనాలు భారీగా రావడంతో ఉళుందూర్‌పేట చెక్‌పోస్ట్‌లో సుమారు 2 కి.మీ మేర వాహనాలు బారులు తీరాయి. వాహనాలు ఒకదాని తర్వాత మరొకటి చిన్నపాటి వేగంతో చెక్‌పోస్ట్ దాటి వెళ్లాయి. చెక్‌పోస్ట్ సిబ్బంది, ట్రాఫిక్ పోలీసులు ఆ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ నియంత్రణకు శ్రమించారు. సోమవారం మధ్యాహ్నం వరకు జాతీయ రహదారిలో ట్రాఫిక్ కొనసాగింది. దీనిని క్రమబద్ధీకరించేందుకు పోలీసులు తీవ్రంగా శ్రమించాల్సివచ్చింది.

ఉద్యోగులను పర్మినెంట్ చేయడం చట్టబద్ధతే

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం



ప్యారీస్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులను పర్మినెంట్ చేయడం సామాజిక న్యాయం కాదని డీపీఐ ఎంపీ తిరుమావళవన్ పేర్కొనడం న్యాయం కాదని, చట్టప్రకారం ఉద్యోగుల పర్మినెంట్ చేయాల్సివుందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి షణ్ముగం పేర్కొన్నారు. గ్రేటర్ చెన్నై కార్పొరేషన్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ ఈ నెల 1వ తేదీ నుండి 13 వరకు విధులు బహిష్కరించిన విషయం తెలిసిందే. ఈ సమ్మెపై డీపీఐ అధ్యక్షుడు తిరుమా ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ, కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చేయడం సామాజిక న్యాయం కాదని తన అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. ఈ వ్యాఖ్యలు సరికావని సీపీఎం నేత షణ్ముగం సోమవారం మీడియాకు తెలిపారు. రాష్ట్రప్రభుత్వ చట్టంలో 240 రోజులు ఉద్యోగం చేసేవారిని పర్మినెంట్ చేయాలని స్పష్టంగా ఉందన్నారు. ఒక్క పారిశుధ్య కార్మికులనే కాదు ప్రభుత్వ అనుబంధ సంస్థల్లో పనిచేస్తున్న ఉద్యోగులు పర్మినెంటుకు అర్హులేనని షణ్ముగం తెలిపారు.

కోవై విమానాశ్రయంలో సీక్రెట్ డ్రోన్, కెమెరా స్వాధీనం

పెరంబూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ విమానాశ్రయంలో సీక్రెట్ డ్రోన్, కెమెరాను కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కోయంబత్తూర్‌కు సోమవారం ఉదయం షార్జా నుంచి వచ్చిన విమాన ప్రయాణికులను అధికారులు తనిఖీ చేపట్టారు. వారిలో ఐదుగురి ప్రయాణికులను అనుమానించిన అధికారులు, వారిని ప్రత్యేక గదిలోకి తీసుకెళ్లి తనిఖీ చేసి, రూ.37 లక్షల విలువైన 856 సిగరెట్ పెట్టెలు, 10 డ్రోన్లు, 36 మైక్రోఫోన్ తదితరాలను స్వాధీనం చేసుకున్నారు. తిరువారూరుకు చెందిన అబ్దుల్ రహీం, తూత్తుకుడికి చెందిన సయ్యద్ సిరాజుద్దీన్, శివగంగకు చెందిన జయనూలాబుద్దీన్, మహ్మద్ అఫ్జల్, తిరుచ్చికి చెందిన మహ్మద్ సిద్ధిక్‌ను వివిధ కోణాల్లో విచారిస్తున్నారు.

ఉప రాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌కు నేతల శుభాకాంక్షలు

చెన్నై, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఉప రాష్ట్రపతి అభ్యర్థిగా రాష్ట్రానికి చెందిన సీపీ రాధాకృష్ణన్‌ను పలు పార్టీల నేతలు అభినందనలు తెలిపారు. ఆయన గెలుపు రాష్ట్ర ప్రజలకు, రాష్ట్రానికి గౌరవం చేకూరుస్తుందని ప్రకటనల్లో పేర్కొన్నారు.

పదవికే గౌరవం: అన్బుమణి

'దేశ ఉప రాష్ట్రపతి పదవికి సెప్టెంబరు 9వ తేది జరగనున్న ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ ఎంపిక కావడం అభినందనీయం. ఎంపీగాను, గవర్నర్‌గా ఆయన చేసిన సేవలు ప్రశంసనీయం. దేశంలో అత్యున్నత పదవికి గౌరవం చేకూర్చే విధంగా సీపీ రాధాకృష్ణన్ సేవలందిస్తారు. ఉప రాష్ట్రపతిగా రాజ్యసభకు నాయకత్వం వహించేందుకు ఆయనకు అన్ని అర్హతలున్నాయి. ఆయనకు మరోసారి శుభాకాంక్షలు'.

విజయం సాధించాలి: టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్

ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో రాష్ట్రానికి చెందిన సీపీ రాధాకృష్ణన్‌ను అభ్యర్థిగా ప్రకటించిన ఎన్డీఏ కూటమికి టీఎంసీ తరఫున కృతజ్ఞతలు. సీపీ రాధాకృష్ణన్ కష్టపడి పనిచేసేవారు, ఉన్నత నైతిక స్వభావం కలిగిన వ్యక్తి, తనకు అప్పగించిన బాధ్యతను అంకితభావంతో, నిబద్ధతతో నెరవేరుస్తారు. మహారాష్ట్ర గవర్నర్‌గా ఆ రాష్ట్రాభివృద్ధికి ఎంతో సహకరించారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల్లో ఆయన విజయం సాధించాలని రాష్ట్ర ప్రజలు, టీఎంసీ తరఫున కోరుకుంటున్నాను'. అలాగే, పుదియ నీతి పార్టీ అధ్యక్షుడు ఏసీ షణ్ముగం, పెరుంతలైవర్ మక్కల్ పార్టీ అధ్యక్షుడు ఎన్నార్ ధనపాలన్ కూడా వేర్వేరు ప్రకటనల్లో సీపీ రాధాకృష్ణన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు పెరంబూరులో నామసంకీర్తనం

ప్యారీస్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): స్థానిక పెరంబూరు పటేల్ రోడ్డులోని కేఆర్ఎం పాఠశాల ప్రాంగణంలోని రంగ హాలులో ఈనెల 19న మంగళవారం సాయంత్రం 6.30 గంటలకు బ్రహ్మశ్రీ విఠల్‌దాస్ మహరాజ్ నేతృత్వంలో 'నామసంకీర్తనం' కార్యక్రమం జరగనుంది. శ్రీకృష్ణా స్వీట్స్, శ్రీవెంకటేశ్వర భక్తసమాజం సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఈ కార్యక్రమంలో భక్తులందరూ పాల్గొనాల్సిందిగా సమాజం అధ్యక్షుడు తమ్మినేని బాబు పిలుపునిచ్చారు.


జిమ్‌లో రజనీకాంత్ వర్కౌట్స్

జిమ్‌లో 'కూలీ' వర్కౌట్స్

ఏడుపదులకు పైబడిన వయసులోనూ సూపర్‌స్టార్ రజనీకాంత్ జిమ్‌లో వర్కౌట్స్ చేస్తూ కెమెరా కంటికి చిక్కారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. యంగ్ డైరెక్టర్ లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో రజనీకాంత్ నటించిన చిత్రం 'కూలీ'. ఇటీవల విడుదలైన ఈ చిత్రం మిశ్రమ స్పందనతో ప్రదర్శితమవుతోంది. ఈ నేపథ్యంలో ఓ జిమ్‌లో రజనీకాంత్‌లో వర్కౌట్స్ చేస్తూ కనిపించారు. టీషర్ట్, షార్ట్స్ ధరించి ట్రైనర్ సాయంతో వివిధ రకాలైన వర్కౌట్స్ చేస్తున్న వీడియోను రిలీజ్ చేశారు. ఈ వీడియోను చూసిన ఆయన అభిమానులు తెగ సంతోషపడిపోతున్నారు.

చిత్రజ్యోతి

తమిళ దర్శకులు ఎడ్యుకేట్ చేస్తారు

● ఏఆర్ మురుగదాస్


ఏఆర్.మురుగదాస్

తమిళ దర్శకులు తమ చిత్రాల ద్వారా ప్రేక్షకులను ఎడ్యుకేట్ చేస్తారని ప్రముఖ కోలీవుడ్ దర్శకుడు ఏ.ఆర్.మురుగదాస్ అన్నారు. తన దర్శకత్వంలో శివకార్తికేయన్ హీరోగా నటించిన చిత్రం 'మదరాసి'. సెప్టెంబరు 5వ తేదీన విడుదలకానుంది. ఈ చిత్రం ప్రమోషన్‌లో కార్యక్రమాల్లో భాగంగా ఆయన ఓ యూట్యూబ్ చానెల్‌కు ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. ఇందులో ఇటీవల తమిళ అగ్ర దర్శకులు శంకర్ 'ఇండియన్-2', 'గేమ్ ఛేంజర్', మణిరత్నం 'థగ్‌లైఫ్' వంటి చిత్రాల పరాజయంపై ఎదురైన ప్రశ్నకు మురుగదాస్ తన దైన శైలిలో స్పందించారు. 'ఒకటి రెండు చిత్రాలు ఫెయిల్ అయినంత మాత్రాన ఆ ప్రభావం అగ్ర దర్శకులపై పడదు. రూ.100 కోట్లు సాధించేలా సినిమాను తెరకెక్కించే దర్శకులు ప్రేక్షకులను ఎంటర్‌టైన్ చేస్తారు. తమిళ దర్శకులు మాత్రం ఎడ్యుకేట్ చేస్తారు. 'సికిందర్' మూవీ కథ నాకు చాలా దగ్గరగా ఉంటుంది. ఈ సినిమా గురించి నేను ఆలోచించిన విధానం వేరు. కానీ, సినిమా తీసిన తీరు భిన్నంగా వచ్చింది. నేను అనుకున్నదాన్ని అనుకున్నట్టుగా తెరపై ఆవిష్కరించలేకపోయా. ఈ సినిమా పరాజయానికి నేనొక్కడినే బాధ్యుడిని కాదు' అన్నారు.

అజిత్‌ను కొత్త కోణంలో చూపిస్తా

● ఆధిక్ రవిచంద్రన్


అజిత్ కుమార్ - ఆధిక్ రవిచంద్రన్

అజిత్ కుమార్ నటించే 64వ చిత్రంలో హీరోను కొత్త కోణంలో చూపిస్తానని ఆ చిత్ర దర్శకుడు ఆధిక్ రవిచంద్రన్ వెల్లడించారు. అజిత్ నటించిన 63వ చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రానికి కూడా ఆధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహించిన విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో తాజాగా నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఆధిక్ మాట్లాడుతూ, "గుడ్ బ్యాడ్ అగ్లీ' చిత్రాన్ని కేవలం ఆయన అభిమానులను దృష్టిలో ఉంచుకుని తెరకెక్కించడం జరిగింది. కానీ, 'అజిత్-64' మాత్రం ప్రతి ఒక్కరూ చూసి ఎంజాయ్ చేసేలా అద్భుతమైన చిత్రంగా తెరకెక్కించేలా కథను సిద్ధం చేశాం. ఇందులో అజిత్‌ను ఇంతకుముందెన్నడూ చూడని కొత్త కోణంలో చూపిస్తాం. అదీకూడా ఆయన అభిమానులకు మెచ్చే విధంగా ఆ పాత్ర, లుక్‌ను డిజైన్ చేస్తాం. ఈ మూవీని 2026 వేసవిలో విడుదల చేసేలా ప్లాన్ చేస్తున్నాం' అని పేర్కొన్నారు.

యాక్షన్ అవతారమెత్తుతున్న హీరోయిన్లు!


సిమ్రాన్, త్రిష

తమిళ చిత్రపరిశ్రమకు చెందిన పలువురు హీరోయిన్లు యాక్షన్ హీరోయిన్లుగా మారుతున్నారు. హీరోయిన్ ప్రాధాన్యం ఉన్న కథా చిత్రాల్లో వారు యాక్షన్ సన్నివేశాల్లో నటించేందుకు ఆసక్తి చూపుతున్నారు. సాధారణంగా ఒక దశ తర్వాత హీరోయిన్లకు పెద్దగా మార్కెట్ ఉండదు. దీంతో వివాహం చేసుకుని కుటుంబ పోషణ, పిల్లలు అంటూ ఇండస్ట్రీకి దూరమైపోతారు. మరికొంతమంది మాత్రం రీఎంట్రీ ఇస్తుంటారు. ఇలాంటి వారిలో కొందరికి హీరో స్థాయికి తగిన పాత్రలు లభిస్తుంటాయి. చిన్న హీరోయిన్ అయితే విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్ వంటి పాత్రల్లో నటిస్తుంటారు. ఈ కోవలో అనుష్క, సిమ్రాన్, నయనతార, రెజీనా, త్రిష మరికొందరు హీరోయిన్లు ఉన్నారు. నయనతార, త్రిష యాక్షన్, థ్రిల్లర్ జానర్‌లో నటిస్తుంటే, సిమ్రాన్ కుటుంబ కథా చిత్రాల్లో నటిస్తున్నారు. నటి రాశి ఇటీవల విడుదలైన 'ఉసురే' చిత్రంలో విలన్ పాత్రను పోషించారు. 'విడాముయర్చి' చిత్రంలో నటి రెజీనా ప్రతినాయికిగా నటించి అందర్నీ మెప్పించారు.

'చవితి' వేడుకలకు
గణపయ్య విగ్రహాలు సిద్ధం

వినాయక చవితి వేడుకల్లో ప్రత్యేక పూజలందుకునేందుకు వివిధ ఆకృతులతో గణపయ్య ప్రతిమలు సిద్ధమయ్యాయి. ఈ నెల 27న చవితి వేడుకలను పురస్కరించుకుని ప్రత్యేక పందిళ్లలో వినాయకుడి ప్రతిమలను ప్రతిష్ఠించి ఐదురోజుల పాటు పూజలు నిర్వహించిన అనంతరం నిమజ్జనం చేసేందుకు హిందూ సంస్థలు నిర్ణయించాయి. ఇదిలా ఉండగా, పొరుగురాష్ట్రాల నుంచి వివిధ ఆకృతులతో సుందరంగా రూపొందించిన గణపయ్య ప్రతిమల విక్రయాలు పులియాన్‌తోపు సమీపంలోని కొసపేటలో ప్రారంభమయ్యాయి. ఈశ్వరుడి ఆకృతిలో, సింహవాహనం, ఐరావతం, గజవాహనాలపై లంబోధరుడు కూర్చున్న భంగిమలో, బుజ్జిగణపయ్యలను సిద్ధం చేశారు. ఈ సారి కూడా భక్తులను ఇట్టే ఆకట్టుకునేలా శివపార్వతుల సుకుమారుడు వినాయకుడు వివిధ రూపాలలో దర్శనమివ్వనున్నాడు.

- ప్యారీస్ , ఆంధ్రజ్యోతి

● హిందూ సంస్థ నిర్వాహకులతో పోలీసుల సమావేశం


సింహ వాహనాలపై అభయమిస్తున్న వినాయకుడు

గ్రేటర్ చెన్నై పోలీసుల ఆంక్షలు..

నగరంలో చవితి పందిళ్ల వద్ద, నిమజ్జన ఊరేగింపులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిపై వెప్పేరిలోని గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ కార్యాలయంలో సోమవారం ఉదయం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో హిందూ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. వారికి వినాయక చవితి వేడుకలను పురస్కరించుకుని విధించిన ఆంక్షలను వివరించారు. గణేశ నిమజ్జనం, ఊరేగింపునకు అనుమతించిన మార్గాల్లో అనుమతించిన తేదీల్లో మాత్రమే తీసుకెళ్లాలని ఆదేశించారు. అదేవిధంగా నిమజ్జనం చేసే ప్రాంతాల్లో సహాయక కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. నుంగంబాక్కం, చింతాద్రిపేట, ఎగ్మోర్, పుదుపేట, పెరంబూరు, వ్యాసర్పాడి, పులియంతోపు, పట్టాళం, షావుకార్‌పేట, అయనావరం, ట్రిప్లికేన్, మైలాపూర్, తేనాంపేట, టి.నగర్, ఎంజీఆర్ నగర్, వడపళని, సైదాపేట, విల్లివాక్కం, కొళత్తూరు, తిరుమంగళం, మధురవాయల్, కోయంబేడు, అరుంబాక్కం తదితర ప్రాంతాల్లో పోలీసులు నిర్దేశించిన మార్గాల్లోనే ఊరేగింపుగా వెళ్లి పట్టిణంపాక్కం, శ్రీనివాసపురం వద్ద నిమజ్జనం చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ఇప్పటి నుంచే అక్కడ పోలీసు పహారా ఏర్పాటు చేశారు. అదేవిధంగా అడయారు, గిండి, ఆదంబాక్కం, మడిప్పాక్కం, నంగనల్లూరు, వేళచ్చేరి, తిరువాన్మియూరులతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రతిష్ఠించే విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి నీలాంగరై పల్కలై నగర్ వద్ద సముద్రంలో నిమజ్జనం చేయాల్సి ఉంటుంది. ఉత్తర చెన్నై ప్రాంతాలైన మింట్, రాయపురం, వాషర్‌మెన్‌పేట, తండయారుపేట, ఆర్కే నగర్, కొడుంగయూర్, మాధవరం ప్రాంతాల్లో ఏర్పాటు చేసే విగ్రహాలను కాశిమేడు వద్ద సముద్రంలో నిమజ్జనం చేసేలా ఏర్పాట్లు చేశారు. నగరంలోని ఇతర బహిరంగ ప్రదేశాల్లో ప్రతిష్ఠించే విగ్రహాల నిమజ్జనం... పోలీసులు సూచించిన నిబంధనలకు లోబడి ఊరేగింపుగా తీసుకెళ్లాల్సి ఉంటుంది. ఈ ఊరేగింపు కోసం నగర పోలీసులు విధించిన ఆంక్షలను, నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నగర పోలీసులు హెచ్చరించారు.


ఐరావతంపై - గజ, సింహ వాహనాలపై - నెమలి వాహనంపై దర్శనమిస్తున్న గణేశ్వరుడు - విక్రయానికి సిద్ధమైన గణపతులు

'కార్ ట్రెజర్ హంట్'కు విశేష స్పందన



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న ఆర్కాడు నవాబు అసిఫ్ అలీ

చెన్నై, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మద్రాస్ వారోత్సవాలను పురస్కరించుకుని నగరంలోనే అతి పెద్ద కార్ ట్రెజర్ హంట్ 'విట్ ఆన్ వీల్స్'కు విశేష స్పందన లభించింది. చెన్నై స్ఫూర్తిని జరుపుకోవడానికి, సూపర్ చెన్నై ఆధునిక, శక్తివంతమైన ప్రకృతి దృశ్యాన్ని కనుగొనడంలో పౌరులకు సహాయపడే లక్ష్యంతో కార్ ట్రెజర్ హంట్‌లో 80 కార్లలో 320 మంది పాల్గొన్నారు. ఈ కార్ ర్యాలీని సూపర్ చెన్నై బోర్డు సభ్యులు నవీన్ కుమార్, సుమన్ పూరా జెండా వూపి ప్రారంభించారు. వీజీపీ యూనివర్సల్ కింగ్‌డంలో ముగిసిన ఈ ర్యాలీ విజేతలైన శ్వేత, గీతకు ఆర్కాటు నవాబ్ అసిఫ్ అలీ రూ.లక్ష కంటే ఎక్కువ విలువైన బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా సూపర్ చెన్నై మేనేజింగ్ డైరెక్టర్ రంజిత్ రాథోడ్ మాట్లాడుతూ.. సూపర్ చెన్నై చొరవతో నగరాన్ని ప్రపంచవ్యాప్తంగా నివసించడానికి అత్యంత అనుకూలమైన టాప్ 100 నగరాల్లో ఒకటిగా ఉంచాలని భావిస్తున్నట్లు తెలిపారు.

అక్టోబర్‌లో గాంధీ మెమోరియల్ మ్యూజియం ప్రారంభం

● మంత్రి స్వామినాథన్


మ్యూజియాన్ని పరిశీలిస్తున్న రాష్ట్రసమాచారశాఖ మంత్రి స్వామినాథన్

ప్యారీస్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మదురై నగరంలో రూ.50లక్షలతో పునరిద్ధరిస్తున్న గాంధీ మ్యూజియాన్ని అక్టోబరులో ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు రాష్ట్ర తమిళ అభివృద్ధి, సమాచారశాఖల మంత్రి స్వామినాథన్ పేర్కొన్నారు. గాంధీ మెమోరియల్ మ్యూజియంలో జరుగుతున్న పునరుద్ధరణ పనులను మంత్రి సోమవారం అధికారులతో కలిసి మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ... ముఖ్యమంత్రి స్టాలిన్ ఉత్తర్వుల మేరకు మదురై గాంధీ మ్యూజియం పునరుద్ధరణ పనులు సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాల్సిందిగా సంబంధిత అధికారులకు ఆదేశించినట్లు తెలిపారు. మంత్రితో పాటు మదురై జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, సమాచారశాఖ కార్యదర్శి రాజారామన్, ఎమ్మెల్యేలు దళపతి, భూమినాథన్, ప్రపంచ తమిళ సంఘం ప్రత్యేక అధికారి ప్రొఫెసర్ అరుళ్ తదితరులు ఆ మ్యూజియం పనులను పరిశీలించారు.

వేలాంకన్ని ఆలయ వార్షిక ఉత్సవాలు

● ఈనెల 27 నుంచి ప్రత్యేక రైళ్లు

ప్యారీస్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): నాగపట్టినం జిల్లాల్లో ప్రపంచ ప్రసిద్ధి చెందిన వేలాంకన్ని మేరీ మాత ఆలయ వార్షికోత్సవాలను పురస్కరించుకుని అక్కడికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం దక్షిణ రైల్వే మూడు ప్రత్యేక రైళ్లను ప్రకటించింది. ఎర్నాకుళం జంక్షన్ - వేళాంకన్ని వీక్లీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 27, సెప్టెంబర్ 3, 10 తేదీల్లో రాత్రి 11.50 గంటలకు ఎర్నాకుళం నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 3.14 గంటలకు వేళాంకన్ని చేరుకుంటుంది. మరోమార్గంలో ఈనెల 28, సెప్టెంబర్ 4, 11 తేదీల్లో సాయంత్రం 6.45 గంటలకు వేళాంకన్నిలో బయలుదేరే రైలు మరుసటిరోజు ఉదయం 11.55 గంటలకు ఎర్నాకుళం చేరుకుంటుంది. ఈ రైళ్లు సెంగోట్టై, రాజపాళయం, శివకాశి, విరుదునగర్, మానామదురై, పుదుకోట, తిరువారూర్, నాగపట్టినం రైల్వేస్టేషన్లలో ఆగివెళ్తుందని దక్షిణ రైల్వే శాఖ తెలిపింది.


లెక్కింపులో ఆలయ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

సమయపురం ఆలయ హుండీ ఆదాయం రూ.1.30 కోట్లు

పెరంబూర్, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తిరుచ్చి సమీపంలోని సమయపురం మారియమ్మన్ ఆలయాన్ని దర్శించుకున్న భక్తులు అమ్మవారికి రూ.1.30 కోట్ల నగదు కానుకగా సమర్పించారు. రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన ఆలయాల్లో తిరుచ్చి సమయపురం మారియమ్మన్ ఆలయం ఒకటి. ఈ ఆలయాన్ని ప్రతిరోజు పొరుగు జిల్లాలు, రాష్ట్రాలు, విదేశాలకు చెందిన భక్తులు సందర్శిస్తుంటారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు, ఆలయ ప్రాంగణాల్లో ఏర్పాటుచేసిన హుండీల్లో కానుకలు చెల్లిస్తుంటారు. ఈ మేరకు 15 రోజులు భక్తులు హుండీల్లో చెల్లించిన కానుకల లెక్కింపు ఆలయ ప్రాంగణంలో జరిగింది. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు రూ.1.30 కోట్ల నగదు, 1.163 కిలోల బంగారం, నాలుగర్నర కిలోల వెండి, విదేశీ కరెన్సీని కానుకలుగా సమర్పించినట్లు ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు తెలిపారు.

తిరుత్తణిలో ముగిసిన ఆడి కృత్తిక ఉత్సవాలు


తెప్పోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

తిరుత్తణి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మురుగన్ ఆలయంలో ఆడి కృత్తిక వేడుకలు సోమవారంతో ముగిశాయి. ఐదు రోజులుగా జరిగిన ఈ వేడుకల్లో వల్లీదేవసేన సమేతుడైన సుబ్రహ్మణ్యస్వామి వివిధ రకాల వాహనాల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. అదేవిధంగా ఆదివారం జరిగిన తెప్పోత్సవంలో పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని సేవించుకున్నారు. ఈ క్రమంలో సోమవారం ఉదయం రకరకాల కావళ్లతో భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. పలు హిందూ సంస్థ నిర్వాహకులు ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నదానం చేశారు.

వేళచ్చేరిలో గెరికేర్ సెంటర్ ప్రారంభం


గెరికేర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న నటి సుహాసిని మణిరత్నం, డాక్టర్ వీఎస్ నటరాజన్

చెన్నై, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): వృద్ధులకు మెరుగైన సదుపాయాలు కల్పించి, వైద్య సేవలను అందించటంలో పేరు గడించిన గెరికేర్ సంస్థ వేళచ్చేరిలో తన 10వ కేంద్రాన్ని సోమవారం ఉదయం ప్రారంభించింది. ఈ కేంద్రాన్ని ప్రముఖ సినీనటి సుహాసిని మణిరత్నం, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ వీఎస్ నటరాజన్ సంయుక్తంగా ప్రారంభించారు. ఈ కేంద్రంలో వృద్ధుల కోసం ప్రత్యేక డయాలసిస్ కేంద్రం, 75 పడకలు, ఫిజియోథెరపి చికిత్సలు వంటి సదుపాయాలు ఉన్నాయని గెరికేర్ హెల్త్ సర్వీసెస్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మీపతి రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వి. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఒయిలాట్టం నృత్యం చేసిన మాజీ మంత్రి ఎస్పీ వేలుమణి


నృత్యం చేస్తున్న వేలుమణి

చెన్నై, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే మాజీ మంత్రి ఎస్పీ వేలుమణి చేసిన ఒయిలాట్టం నృత్యం ప్రేక్షకులను అలరించింది. కోయంబత్తూర్ జిల్లా నల్లూర్‌వయల్, ఆలాందురై పుదూర్ సంగమం కళా బృందం ఆధ్వర్యంలో 105వ అరంగేట్రం వేడుకలు నల్లూర్‌వయల్‌లో ఆదివారం రాత్రి జరిగాయి. మాజీ మంత్రి, అన్నాడీఎంకే జనరల్ సెక్రటరీ ఎస్పీ వేలుమణి ముఖ్యఅతిథిగా పాల్గొని వేడుకలు ప్రారంభించారు. ఆ సమయంలో కళాకారులు, తమతో కలసి ఒయిలాట్టం నృత్యం చేయాలని వేలుమణిని కోరారు. వారి అభ్యర్థన మేరకు వేలుమణి ఒయిలాట్టం ఆడుతూ అందర్నీ ఆనందింపజేశారు.

కుట్రాలంలో స్నానాలకు బ్రేక్


కుట్రాలం ప్రధాన జలపాతం వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న జలాలు

చెన్నై, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): తెన్‌కాశి జిల్లాలోని కుట్రాలం జలపాతం వద్ద ఆదివారం ఉదయం నీటిధారలు ఉధృతంగా పడుతుండడంతో పర్యాటకులు ఆ ప్రాంతం వద్ద స్నానం చేయకుండా అధికారులు నిషేధించారు. తెన్‌కాశిలోని పడమటి కనుమల ప్రాంతాల్లో ఇటీవల భారీగా వర్షాలు కురవడంతో కుట్రాలం జలపాతాలు ఉధృతంగా మారాయి. శుక్రవారం ఉదయం ప్రధాన జలపాతం వద్ద పర్యాటకులు స్నానం చేస్తుండగా ఉన్నట్టుండి నీటి ధారల వేగంగా పెరిగి దూసుకురావటంతో అధికారులు సైరన్ మోగించి అందరినీ అక్కడి నుంచి తరలించారు. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు ప్రధాన జలపాతం, ఐందరువి, పాత కుట్రాలం వద్ద ఇదే పరిస్థితులు కొనసాగడంతో పర్యాటకుల స్నానంపై అధికారులు నిషేధం విధించారు.


తన మనవరాలి వివాహ పత్రికను చెన్నైలోని సీఎం క్యాంపు కార్యాలయంలో సోమవారం ముఖ్యమంత్రి స్టాలిన్ దంపతులకు అందిస్తున్న వీఐటీ వ్యవస్థాపకుడు, ఛాన్సలర్ డాక్టర్ జి.విశ్వనాథన్



గౌతమ్‌రాజు

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని సోమవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. ప్రభుత్వ విప్ జీవీ ఆంజనేయులు, సినీ ప్రముఖుడు ఘట్టమనేని ఆదిశేషగిరిరావు, సీఎం సోదరి హైమావతి, సినీనటుడు గౌతమ్ రాజు, తెలంగాణ ఎమ్మెల్యే గడ్డం వినోద్ ఉన్నారు.



ఆదిశేషగిరిరావు, హైమావతి

ఘాట్‌రోడ్డు పనుల పరిశీలన

తిరుమల, ఆగస్టు18 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నుంచి తిరుమలకు చేరుకునే రెండవ ఘాట్‌రోడ్డులో టీటీడీ ఈవో శ్యామలరావు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఘాట్ రోడ్డులో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఘాట్‌రోడ్డు సుందరీకరణకు, శుభ్రతకు పలు సూచనలు చేశారు.




ఘాట్‌రోడ్డులో ఈవో శ్యామలరావు

సర్వదర్శనానికి 12 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 3 షెడ్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.46 కోట్లు
ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 86,364
తలనీలాలు సమర్పించినవారు: 30,712



World Photography Day

అందాల విందు

ఫొటో అంటే సమాజానికి అద్దం కాదు, అర్థం. దృశ్యానికి ఛాయాచిత్రకారుడు చేసే కవితాత్మక వ్యాఖ్యానం. నమోదయ్యే ఒక చరిత్ర. కూలిన గోడ.. ఆశ్రయమిచ్చే నీడ.. రాలే చినుకు.. పేవ్‌మెంట్‌మీద కునుకు.. విరిసిన పువ్వు.. పసికందు నవ్వు.. కాదేదీ ఫొటోకనర్హం. శేషాచలం ఫొటోగ్రాఫర్లకు ఖజానా. ఆకుపచ్చని అందాలే కాదు.. పాకే పురుగు, ఎగిరే పిట్ట, దూకే జలపాతం.. సమస్తమూ ఛాయాచిత్రవస్తువే. అందుకు సచిత్ర సాక్ష్యమే ఈ ఫొటోలు. చిత్తూరు, తిరుపతి నగరాల్లో, తిరుమల కనుమ దారుల్లో తీసిన ఫొటోలు ఇవి. వాన కురిసే వేళ చిత్రవిచిత్రమైన బుల్లి జీవజాలాన్నీ, పర్యాటక ప్రదేశంలోని జనజీవితాన్నీ ఫొటోగ్రఫీ డే సందర్భంగా ఆంధ్రజ్యోతి అందిస్తున్న ఫొటోల విందు ఇది..

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్లు, తిరుపతి, తిరుమల, చిత్తూరు





ఎదురు చూపులు



నీళ్లొదిలానోచ్!



చీమల వంతెన



దిగులు వానలు



పహారా





బుల్లి వింత జీవుల లోకం



లోపల ఏముందో





తడిచిన బతుకులు













స్వామిదే.. భారం!



పార్టీ కో ఆర్డినేటర్‌కు ప్రొటోకాల్ ఎలా పాటిస్తారు?

● కలెక్టర్, ఎస్పీలకు సత్యవేడు ఎమ్మెల్యే ఫిర్యాదు

తిరుపతి, ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): సత్యవేడు నియోజకవర్గంలో టీడీపీ కో ఆర్డినేటర్‌కు ప్రొటోకాల్ ఎలా పాటిస్తారంటూ సస్పెన్షన్‌లో ఉన్న టీడీపీ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధన్‌రాజుకు సోమవారం ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతోనూ మాట్లాడారు. ప్రజాప్రతినిధిగా తాను అభివృద్ధి పనులను ప్రారంభించాక, ప్రభుత్వ కార్యక్రమాలను చేపట్టాక మరొకరు ఎలా చేపడతారని ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా తాను పాల్గొనే కార్యక్రమాల్లో ఎవరైనా పాల్గొనవచ్చు గానీ విడిగా కార్యక్రమాలు చేయడమేమిటని ప్రశ్నించారు. ఇది ప్రొటోకాల్ నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని ఆరోపించారు. పార్టీ కో ఆర్డినేటర్ ప్రైవేటు కార్యక్రమాలకు హాజరైనా మండల స్థాయి అధికారులు ప్రొటోకాల్ పాటిస్తున్నారని ఆరోపించారు. దీనిపై తక్షణం చర్యలు తీసుకోవాలని కోరారు. తన ఫిర్యాదుపై స్పందించకుంటే అసెంబ్లీ ప్రివిలేజ్ కమిటీకి ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. అందరూ భాగస్వాములై నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలని కోరారు.

తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి: సత్యవేడులో టీడీపీ కో ఆర్డినేటర్‌కు పోలీసు విభాగం తరపున ప్రొటోకాల్ ఎలా కల్పిస్తారని ఎమ్మెల్యే ఆదిమూలం ఎస్పీ హర్షవర్ధరాజును కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఆయన పెళ్లిళ్లు, ఆలయాలకు వెళుతున్నా మీ పోలీసులు వెంట వెళుతున్నారని చెప్పారు. దీనిపై పరిశీలించి ఎలా చేయాలో అలా చేస్తానని ఎస్పీ చెప్పారు.



కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

ప్రహరీ దూకి.. సీసీ కెమెరాలు పగులకొట్టి

● టీటీడీ సూపరింటెండెంట్ ఇంట్లో చోరీ

● 220 గ్రాముల నగలు, 460 గ్రాముల వెండి వస్తువుల అపహరణ

తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 18(ఆంధ్రజ్యోతి): ప్రహరీ దూకారు. ఆధారాలు దొరక్కుండా సీసీ కెమెరాలు పగులకొట్టారు. టీటీడీ (తిరుమల వైకుంఠం-1) సూపరింటెండెంట్ శ్రీనివాసులు ఇంట్లో దొంగలు పడి 220 గ్రాముల బంగారు నగలు, 460 గ్రాముల వెండి వస్తువులు అపహరించుకుని వెళ్లారు. తిరుపతి క్రైం సీఐ ప్రకాష్‌బాబు తెలిపిన ప్రకారం.. తిరుపతి బైరాగిపట్టెడలో నివాసం ఉంటున్న టీటీడీ సూపరింటెండెంట్ శ్రీనివాసులు ఈనెల 14న హైదరాబాదులోని కుమార్తె ఇంటికి కుటుంబంతో కలిసి వెళ్లారు. సోమవారం ఉదయం 7.30 గంటలకు తిరిగి ఇంటికి రాగా.. తాళాలు పగులకొట్టి ఉన్నాయి. ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండటంతో అనుమానం వచ్చింది. బీరువాలో చూడగా బంగారు నగలు, వెండి వస్తువులు కనిపించలేదు. దీంతో ఈస్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీఎస్పీ భక్తవత్సలం ఆధ్వర్యంలో సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ గిరిధర్, క్రైం సిబ్బంది సంఘటనా స్థలం పరిశీలించారు. క్రైం అదనపు ఎస్పీ నాగభూషణరావుకు సమాచారం ఇచ్చారు. క్రైం డీఎస్పీ శ్యాంసుందర్, సీఐలు చిన్నపెద్దయ్య, ప్రకాష్‌బాబు, ఐడీ పార్టీలు, వేలి ముద్రల నిపుణులు, డాగ్ స్క్వాడ్‌లు ఇంట్లో పరిశీలించాయి. వేలి ముద్రలు సేకరించారు.

ఇంట్లోనే బీరువా తాళాలు

హైదరాబాదుకు వెళ్లే సమయంలో శ్రీనివాసులు కుటుంబీకులు రెండు బీరువాలకు తాళాలు వేసి అక్కడే ఉంచారు. దీంతో దొంగలు ఆ తాళాలు తీసుకుని బీరువా తలుపులు తీసి 220 గ్రాములు బంగారు నగలు, 460 గ్రాములు వెండి వస్తువులు అపహరించుకుని వెళ్లారు. ఆ తాళాలూ తమతో పాటే వారు తీసుకెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. ఇంటి వద్ద సీసీ కెమెరాలు పగులకొట్టినా, వీధిలోని సీసీ కెమెరాల ఆధారంగా క్రైం పోలీసులు ఫుటేజీలను పరిశీలించారు. దొంగలు ఆటోలో వచ్చి.. వెళ్లినట్లు గుర్తించారు. నిందితుల ముఖాలు గుర్తు పట్టినట్లు విశ్వసనీయ సమాచారం. క్రైం పోలీసులు కేసు నమోదు చేసి వివిధ కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.



దొంగతనం జరిగిన తీరును పరిశీలిస్తున్న క్రైం డీఎస్పీ

పింఛను తొలగిస్తామంటున్నారు

అధికారుల ఎదుట బోరుమన్న దివ్యాంగులు - కలెక్టరేట్ పీజీఆర్ఎస్‌కు 238 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 18 (ఆంధ్రజ్యోతి): మేమంతా దివ్యాంగులం... ఇదే సదరం సర్టిఫికెట్లతో ఎన్నో ఏళ్లుగా పింఛను పొందుతున్నాం. ఇప్పుడేమో అనర్హులంటూ అధికారులు నోటీసులు పంపిస్తున్నారు అంటూ పలువురు దివ్యాంగులు అధికారుల ఎదుట బోరుమన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 238 వినతులు వచ్చాయి. అందులో భూసమస్యలపైనే 130 వచ్చాయి. కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, ఇతర అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పీజీఆర్ఎస్ అర్జీల విషయంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులను హెచ్చరించారు.



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

పింఛను నిలిపేస్తే ఎలా బతకాలి?

నేను దివ్యాంగురాలిని. నడవలేని పరిస్థితిలో ఉన్నాను. వెరిఫికేషన్ పేరుతో సదరంలో వికలత్వం తక్కువ శాతం ఉందని పింఛను ఇవ్వమని అధికారులు అంటున్నారు. ఇది చాలా అన్యాయం. వీల్‌చైర్ లేకుండా నడవలేను. పింఛను లేకపోతే నేను ఎలా బతకాలి చెప్పండి.



- అరుణ, ఎస్‌కేడీనగర్, తిరుపతి

దివ్యాంగుల కోటాలో ఉద్యోగం ఇప్పించండి

అయ్యా నేను మనిషి సాయం లేకుండా నడవలేను. ఎంబీఏ వరకు చదివాను. దివ్యాంగుల కోటాలో ఉపాధి కల్పిస్తే ఆధారంగా ఉంటుంది. సాయం చేయండి.



- సాయి భాస్కర్, శ్రీకాళహస్తి

శంకరంబాడి విగ్రహానికి మెట్లు ఏర్పాటు చేయండి

మహాకవి శంకరంబాడి సుందరాచారి విగ్రహానికి మెట్లు ఏర్పాటు చేయండి. రోడ్డు విస్తరణలో భాగంగా ఆయన విగ్రహాన్ని లక్ష్మీపురం సర్కిల్‌లో వంతెన కిందకు మార్చారు. అయితే విగ్రహానికి పూలమాల వేయాలన్నా, నివాళులు అర్పించాలన్నా ఇబ్బందికరంగా ఉంది. అలాగే శిలాఫలకంలో అక్షర దోషాలు సరిచేయండి.

- మస్తానమ్మ, అధికార భాషా సంఘం, మాజీ సభ్యురాలు

పుట్టుకతోనే వికలాంగుడిని

నేను పుట్టుకతోనే వికలాంగుడిని. ఏ పనీ చేసుకోలేను. ఎంతో కాలంగా పింఛను తీసుకుంటున్నాను. అయితే వికలత్వం తక్కువగా ఉందని పింఛను నిలిపివేస్తున్నామంటూ అధికారులు నోటీసులు ఇచ్చారు. 70శాతానికి పైగా ఉన్న వికలత్వంతో ఎడమకాలితో నడవలేను. పింఛను నిలిపేస్తే బతకలేను.. న్యాయం చేయండి.



- ఆర్ముగం, వేదాంతపురం, తిరుపతి రూరల్

తుడా పార్కు స్థలం అన్యాక్రాంతమవుతోంది

తిరుపతి రూరల్ రామానుజపల్లి ఉద్యోగనగర్ కాలనీలో తుడా అప్రూవల్ వెంచర్‌లో పార్కు స్థలం అన్యాక్రాంతమవుతోంది. ఆ స్థలంలో మొక్కలు నాటి మౌలిక వసతులు కల్పించాలి.

- బుజ్జిబాబు, రామానుజపల్లి, తిరుపతి రూరల్

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ను తొలగించండి

వెంకటగిరి మున్సిపాలిటీ శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావును తొలగించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ నేతలు, కార్మికులు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం, ఆర్.లక్ష్మి సంఘీభావం ప్రకటించారు. సమస్యలు పరిష్కరించాలని 60 రోజులుగా కార్మికులు దీక్ష చేస్తున్నా అధికారులు స్పందించకపోవడం దుర్మార్గమన్నారు. పదేళ్లుగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావు ఒకే స్థానంలో కూర్చుని కార్మికులను వేధిస్తున్నాడని, ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదని అన్నారు. చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.



కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న వెంకటగిరి మున్సిపల్ వర్కర్స్

మసీదు స్థలాన్ని కాపాడండి

దుర్గసముద్రం జగనన్న కాలనీలో గత ప్రభుత్వం మసీదు కోసం ఇచ్చిన పది సెంట్లను కొందరు ఆక్రమించుకునే ప్రయత్నిస్తున్నారని పలువురు మైనార్టీలు జేసీ శుభం బన్సల్‌ను కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషను కల్పించాలని బీఎస్పీ నేతలు కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేసి అధికారులకు వినతిపత్రం అందజేశారు.